కథా నిలయం
2021
శ్రీకాకుళం

# ధర్మశాల

అక్కా! దాదాపు పదినెలల తరువాత నీకీ వుత్తరం వ్రాస్తున్నానంటే ఈ ఆలస్యానికి కారణం నేను కాదు సుమా! అబ్బ! అప్పుడే బుంగమూతి పెట్టకమ్మా తవప్రణయక్రీత దాసః, అంటే సారి అదే మా బావ, చూసి ప్రణయపుటలుకేమోనని శరవేగంతో వచ్చి పట్టెమంచం అలంకరించగలరు. ఆఁ నాది కొంటెతనమా? కాదక్కా! అది బావసొత్తు దాన్ని స్వయంగా బావ నాయనమ్మగారు జాజికయతో పాటే రంగరించి వెన్నతో పెట్టింది బావకు, 'నోచిన వారి సొమ్ములవి నోమని వారికి దక్కునటే? అందుకే దాన్ని నాకు దానం చేయటానికి నీకే అధికారం లేదు. అట్లా బావతోపాటే పెరిగిన ఆ గుణరాజం వో వైపూ, మరి ఇప్పుడు నీ వోవైపూ భుజకీర్తుల్లా వైభవంగా వెలుగుతూ ఉంటే బావ రససామ్రాట్టులా ప్రకాశిస్తున్నాడు. అందుకే ఓ పున్నమనాటి రేయి శుభవేళ నీ చేతులమీదుగానే ఆ బిరుద ప్రదానమహోత్సవం చేసేయి. నీ కష్టం బావగారేం ఉంచుకోరులే! ఉచితజ్ఞుడు కదా మరి! వెంటనే కృతజ్ఞతా సూచకంగా నిన్ను ఆశ్లేషమాలికల్తో అలంకరించి ఋణం తీర్చుకుంటాడులే!

ఇంకా బావ నీ పక్కలోకి చేరలేదని నమ్మమంటావా? ఇద్దరు కలిసే చదవండి కాని ఎందుకైనా మంచిది ఉత్తరం పూర్తయ్యేవరకు బుజ్జిగాణ్ణి మాత్రం క్రిందకు దించకు సుమా!

అక్కా! మన ఊరికి ఈశాన్యభాగంలో ఉన్న గున్న మామిడితోపు నీకు జ్ఞాపకం వుందికదూ? అయ్యో నా తెలివి తెల్లవారినట్లే వుంది. కాకపోతే ఆ మామిడితోపు మీ ప్రణయలీలా విలాసంపు చోటు, మీ అనురాగరసాలు పంచిన చోటు. మీ దాగుడు మూతలకు కర్మసాక్షిగా నిలిచిన చోటును మరుస్తావా? అదే ఆ తోటను గణపతి కొని మాంచి ఇల్లు కట్టాడులే...

ఆ ఇల్లు చతురస్రాకారంగా ఉంది. అంటే నాల్గు ఆశ్రమాలకు, నాలుగు అవస్థలకు నాలుగు కోణాలకు, నాలుగు వేదాలకు, దిక్కులకూ, చివరకు నాలుగు జాతులకూ ప్రతీకగా నిలిచినట్లు ఆ ఇల్లు ముచ్చటగా వుంది.

ఉన్నట్లుండి ఆయనకేం బుద్ధి పుట్టిందోగాని దానికి 'ధర్మశాల' అని పేరుపెట్టి అద్దెకిచ్చాడు. లక్షణంగా ఇంటికి 'లక్ష్మీవిలాసమో' 'ప్రణయవిహారమో' అనే పేరు పెట్టుకోక 'ధర్మశాల' ఏమిటీ వైద్యశాల, పాకశాల, పశుశాల అన్నట్లు అని మీరిద్దరూ ఆలూమగలూ ఒక గొంతుతో ప్రశ్నిస్తారేమో? మీరేకాదు ఆ ఇంటికి వచ్చిన ప్రతి వారూ మొదట వేసిన ప్రశ్న ఇదే.

అంతెందుకు ఆ ఇంటికి అద్దెకు వచ్చిన పరమేశంగారి సతీమణి మొదట అయ్యోరాత! గవర్నమెంటు ఉద్యోగంలో నెలకు పన్నెండు వందలు సంపాదిస్తూ ధర్మశాలల్లో వుండవలసిన ఖర్మ మనకేమొచ్చిందండి?' అంటూ నొసలు బాదుకుందట.

అన్నారం నుండి వచ్చిన రైతు రామయ్యగారి భార్య పార్వతమ్మ 'అయ్యోకతా! దేవుడు ఇచ్చినట్లు ఇంతో అంతో పాడీ పంటా, మార్యద, మన్నన వుండి ప్రాణాన్ని కొలకుల్ల వెట్టుకున్నట్టు ఉళ్ళ ఇండ్లు కరువైనట్లు నన్నూ పిల్లను దెచ్చి సత్రంల దింపుతుండరేందయ్యా?' అని అడిగిందట.

రామనాథశాస్త్రిగారి ఇల్లాలు 'ఏమండీ! మిమ్మల్నే అసలా కొంప అగ్రవర్ణస్తులు పాదం మోపదగ్గదేనా? పేరే ఇలా ఏడుస్తూ వుంటే లోపల చాపకూడు వడ్డించి చస్తున్నారేమో? అనాచారపు కొంపలు, ఏమూల జూసినా!' అని వణికిపోయిందిట.

నాయుడుగారి అర్థాంగి తాయారమ్మ మాత్రం ఏదో అనబోతున్న నాయుడుగారి చేతిలో తన వ్యానిటీ బ్యాగ్ పెట్టి 'మీరలా తొందరపడకండి' అంటూ నాయుడుగార్ని అలా వుంచి తాను ముందుకు వచ్చి గణపతిని సవాలు చేసినట్లు చూస్తూ 'డబ్బుచ్చుకొని అద్దెకిచ్చె కొంపలకు 'ధర్మశాల' అని పేరెడ్తే అందులో కాపురం తగలడి చచ్చేవాళ్ళ పరువు ఏ గంగపాలు కావాల్నని మీ ఉద్దేశం? అని ప్రశ్నిస్తే గణపతి గంభీరంగా ముఖం పెట్టి చిరునవ్వుతో ప్రశాంతంగా ఆరితేరిన వక్త ఉపన్యాస ప్రారంభానికి ముందు సభాసదులను కలియజూసినట్లుగా తాయారు దంపతులను చూసి తన ఆదర్శాలు అభిప్రాయాలు అన్నీ విశదం చేసి

'ఈ కట్టుబాట్లు మీరు పాటిస్తేనే లోపలికి రావలసింది. అంతేగాని మీరప్పుడే నా అంగీకారం పొందినట్లు కొంపలో కాపురం తగలడ్తే ఎలా? అని ప్రశ్నించకండి' అని అన్నారు.

ఏమైతేనేం! 'పేరులో ఏముందిలే ఇల్లు సౌకర్యంగా ఉంటే చాలు' అని సమాధానపడి నలుగురూ నాలుగు భాగాలల్లో చేరిపోయారు.

ఇంట్లో ప్రవేశించిన కొత్తలో పరమేశంగారి భార్య నాగమణి భోజనాలైన తరువాత వెంకటమ్మగార్ని పలుకరిస్తూ ' ఏవండీ సాపాటయిందా? ఇల్లు రొంబ నెమ్మతిగా వుంది. సందడేలే? మీ పిల్లలంతా ఎక్కడికి పూడ్చినారు? పాలవాడు ఎప్పుడు వచ్చును? అని అడిగే

వరకు వెంకటమ్మగారు రెండు చెవులు మూసుకుని రామ రామ! దీనికేం పోయేకాలం? అపశకునపక్షి దీని బోడి సరసం ఎవరిక్కావాలి. ప్రొద్దుటే లేచి ఎవరి ముఖం చూశానో ఈ అప్రాచ్యపు మాటలూ అమంగళపు కూతలు వినాల్సి వచ్చింది' అని బాధపడుతూ ఏం సమాధానం చెప్పకుండా తలుపులు దభేల్న బిగించుకుందట. ఇప్పుడిప్పుడే నాగమణి వెంకటమ్మగారిద్దరూ విషయం గ్రహించి కొంత స్నేహంతో ఉంటున్నారు.

పార్వతమ్మ పూర్తిగా ధర్మశాలను తన అన్నగారిల్లులా భావించి వచ్చిన వాళ్లందరితో 'మా గణపతన్న శానా మంచోడు. కడుపు నిండ ప్రాణవార్తికమే, తీపి దప్ప కుటిలంగాని, కువ్వారంగాని యా కోశాన గాన్రాదు. ఇంత వసతున్న ఇల్లు యాడ దొర్కావోయింది మీరే జెప్పుండి. చిప్పెడు సోటుంటె జాలు కోళ్లగూళ్లోలె కలందాన్ అరలోలె అన్ని ఇండ్లు మల్సి కిరాయిలకిస్తె కూసుంటె గోడదగిలె లేస్తే దూలం దగిలె నని ఇర్కుటం ల పడాల్సి వొస్తది. మా ధర్మశాల జూడరాదుండి మన ఊళ్ల చతుశ్శాల భవంతి తీర్గ ముద్దుగ గట్టిండు' అని చెప్పుతూ ఉప్పొంగి పోయేది.

తాయారమ్మగా రిప్పుడు గణపతిని గూడా మాట్లాడనీయటం లేదు. ధర్మశాలకు తానే ధర్మకర్తగా భావించి వాకిలి మధ్యలో ఉన్న రావి చెట్టు అరుగును చిన్న మహిళా సభగా మార్చేసింది.

మొదట మొదట ఎదుటి భాగాలల్లో కోడి రొయ్యలు, తదితర మత్స్య మాంసాదులు వండుతూ ఉంటే వెంకటమ్మగారు భరించలేక శాస్త్రిగారితో ' ఏవండి ఈ యానాదికొంపల్లో పడి ఈ కంపులు భరించలేను. మీరు నోరు మెదపకుండ ఎలా ఉంటున్నారండి' అని గోలపెడితే నన్నేం చేయమంటావే? వాడింట కోడి కాల్చా! తగాదాలు నావల్ల కాదన్నాడు. ఆ మాటలు విన్న నాయుడుగారు నవ్వుతూ వచ్చి ' ఏమండి బావగారూ! తమరి వాక్కు అమోఘం కావాలి. అలా దీవించండి. ఇంతకన్న దివ్యమైన భోగం ఏం కావాలి' అన్నాడట.

ఈ మాటలు వింటున్న వెంకటమ్మగారు వెంటనే ప్రవేశించి 'లేదులెండి అన్నయ్యగారూ! వారేదో? తొందరపడ్డారు' అంటూ స్వయంగా కాఫీ చేసి పట్టుకొచ్చి ఇచ్చిందట. దీంతో ఆ రెండిళ్ల మధ్యలో ఉన్న రుసరుసలు కాస్త సర్దుకుపోయాయి.

పాపం ఇప్పుడు నాగమణి సంభాషణలో 'పూడ్చు' ను తెర మరుగుకు పంపి, సాధించి 'వెళ్లను' అలవాటు చేసుకుంది ఇక పార్వతమ్మ గల గలా నవ్వుతూ

'చూడుండి తల్లీ! మీరేమన్నా అనుండి నడుమంత్రపు సిరొచ్చి అర్ధమరేయి చెత్తరి దెమ్మన్న కతోలె నామాట ఇడ్సి మీ యాస నేర్చుకోవాలంటే నా తరంగాదు, 'బాస బిస తప్పితే పట్టు తంగెళ్లు' అన్నరంట. అయినా నా మాటలల్ల మన తెలుగుమాట గాని పల్కువడియాండదని? ఇంగయాసంటరా? యాదైన యాస యాసనే! రాణివాసం వొచ్చి మూలవాసం బీకిందంట మీ మెప్పితం కోసం నేర్చుకుందామన్న ఒక్క తీరుగాదాయె విడ్సి.

అసొంటప్పుడు మళ్లా నాల్గు యాసలల్ల యాడ కొత్తగ ఓనుమాలు దిద్దుకుందు' అని అన్నాగుడ కల్లాకపటం ఎరుగని పార్వతమ్మ హృదయ నైర్మల్యాన్ని గ్రహించిన వాళ్లెవ్వరూ తప్పుగా భావించక ఆమె మాటల్లోని ముద్దును మాత్రం అందరూ అలవాటు చేసుకున్నారు.

ఇట్లా ఆ నాల్గు వాటాలల్లో ఉన్నవాళ్లు తగవులూ, రాద్ధాంతాలు, గుసగుసలూ సూటి పోటి మాటలూ, చిల్లర చేతలూ అన్నీ విడిచి సహభావంతో కలసి ఉండటం ప్రారంభించారు. ఈ పరిణామం చూసి గణపతి ''మర్ధన చేయగా చేయగా కట్టెలోంచి నిప్పు పుడుతుందన్నారు. దేనికైనా ప్రారంభం- ప్రయత్నం ముఖ్యం'' అని వెంటనే దిష్టి తగులుతుందేమో అన్నంత భయంతో ఆఁ ఏముందీ! ప్రయత్నం మనవంతు! ఫలితం దైవాయత్తం కదా! అని కొంత వైరాగ్యంతో అఖండ విజయాన్ని సాధించినట్లు, దాయాదిపై దావాలేసి పాత చెంబు పంచుకున్నంత ఆనందంతో ఉప్పొంగిపోయాడు. ఇట్లా ఆ 'ధర్మశాల' ఇప్పుడు నిండుగా, పెద్దా చిన్నల్తో కిళకిళలాడ్తూ అంటే పార్వతమ్మ మాటల్లో ముద్దుగా ఉంది.

'వెన్నెల' పార్వతమ్మ చిన్న కూతురు. పిల్ల నామకరణం నాడు మేనత్త కమలమ్మ చిన్న దాన్ని చేతుల్లోకి తీసుకుని 'అన్నా! నీ ఇంట్ల చంద్రదీపం బుట్టిందే! ఇది మాటల తల్లి ఐతది. ఎన్న ముద్దకు ముక్కూ మొకం దిద్దినట్లుండది. దీని చిల్క నగులుజూడు సిరిపొన్నలు రాల్తుండవి. ఎన్నల గురుస్తండది' అని 'వెన్నెల' అనే పేరు పెట్టింది.

పచ్చని పంటచేలు ఆఁ అంటే ఓ అని మారుమ్రోగే చిన్న చిన్న గుట్టలు, కాటుక కళ్లతో కడివెడు పాదుగుతో, దూడల కోసం అంబా అంటూ పాలు చేపుతున్న గోవులు, మీగడపాలు, గడ్డపెరుగులతో పెరిగిన వెన్నెలకు ధర్మశాలకన్న, దాని వెనుక ఉన్న మోటభావి, గున్నమామిళ్లే ఇష్టం. అందుకే వెన్నెల ప్రతినిత్యం అక్కడికి వెళ్లి తాను నాటుకున్న పూల మొక్కకు పాదులు తీసి, నీళ్లు పారించి, తీగెలను పందిళ్లకు ఎక్కించి, గున్నమావి మొదట్లో కూర్చుని పూలల్లుకుని, పాటలు పాడుకుని వచ్చే అలవాటు.

వెన్నెల కిన్నెరలా పాడుతుంది. ఆ కంఠంలో తీయతేనియల రుచితో కచ్ఛపిశ్రుతులు వినిపిస్తాయి. అయితే ఈ విద్య వెన్నెలకు వెన్నతో బెట్టి నేర్పింది కాదు, పూర్వ జన్మ సంస్కారంతో జన్మతః సిద్ధించిన భగవదనుగ్రహ విశేషం అది. అందుకే అనునిత్యం ఎవరూ లేని చోట ప్రకృతిని చూసి పరవశించినట్లుగా తాను అన్నారపు రావూలయంలో కృష్ణమాచార్యులు పాడగా విన్న మువ్వ గోపాల పదాలు పాడుకుంటుంది. గుణవంతురాలైన ఈ పిల్లను గూర్చి ఎవ్వరూ ఎప్పుడూ ఏదీ పట్టించుకోలేదు.

వైశాఖ పూర్ణిమ శుక్రవారం సాయంకాలం యథాప్రకారం వెన్నెలవెళ్లి గున్నమావి క్రింద కూర్చుని కొంగులో నింపుకున్న మల్లెమొగ్గలన్నిటికి తొడిమెలు తీయటం పూర్తయ్యాక దారం జ్ఞాపకం వచ్చి పాడుతున్న పాటను మధ్యలో ఆపి లేవబోతూ ఉండగా 'కాశ్మీరా! పాట ఆపకు' అన్నాడు చంద్రశేఖరశాస్త్రి, వెల్లి పోయింది వెన్నెల.

పాట విన్నంత సేపు నిజమూర్తగళత్సుధారస మాధురితో యోగ సమాధి సాక్షినట్లుండి పాట ఆగిపోగానే సమాధి చెడిన యోగి వలె కేవలం రసలోలుప బుద్ధితో మాత్రమే తనకు తెలియని వంటరికత్తెను కోరినాడు. తన ఉనికి ఆ పాట ఆపటానికి కారణం అనుకుని 'అహో! స్వయం కృతాపరాధం! ఇన్నాళ్లుగా నేనుపాసించే ఆ జగన్మోహిని ఈనాడు నన్ననుగ్రహించినట్లుగా ఈ గానమాధురి నా సర్వాంగాలను జాగృతం చేసి నాకేదో అనిర్వాచ్యమైన సుఖానుభూతిని కల్పిస్తే ఆ ఆనంద పారవశ్యంతో పులకించి రసభంగం చేశాను. ఆ రస నిష్యందిని ఎవరో? అనాఘ్రాతపుష్పం కాదు పసిడి మొగ్గవలె ఉంది. ఎంత రమణీయంగా వుంది ఈ ప్రకృతి. నేను తోటలో ప్రవేశించినప్పుడు నాకీ అనుభూతి కలుగలేదు. అవును! నిగ్రహింపరానిదికదా వశీకరణ ప్రభావం'' అని భావించుకుంటూ మరోసారి గున్నమావి మొదలు చూచి వెళ్లిపోయాడు కాశీ విశ్వవిద్యాలయం నుంచి తిరిగి వచ్చిన వెంకటమ్మగారి కొడుకు చంద్రశేఖర శాస్త్రి. కాని అన్ని వేళల్లో కళ్లుతెరిచి వున్న మదనుడు మాత్రం ఎందుకైనా మంచిదని మరుక్షణంలోనే పరికరాలను సవరించుకుని సందడిలో పడ్డాడు. అప్పుడే చేతికందిన అరవిందం వింటిని అలంకరించిది.

అక్కా! ఈ మాటలు చదివిన బావ కథను ముందు చదవనియ్యటం లేదు కదూ! ఇప్పుడు బావ చదువుతున్న ఉత్తరాన్ని లాక్కుని తన ఎడం చేత్తో నిన్ను, అంటే నీ నడ్మునే లేవే తల్లి పెనవేసుకుని 'ముక్తా మీ చెల్లెలి కథలో ఉన్న ఆ క్యూపిడ్‌గాడు పరమశాంతుడులా ఉన్నాడు. ఎంతో దూరపు చూపుతో 'నకూప ఖననం యుక్తం దీప్యతే వహ్ని నా గృహే' అన్న సుభాషితం చదివినట్లు ఆ చంద్రశేఖరశాస్త్రిగారి చిత్తజుండు జాగ్రత్తగా బాణాలు సమకూర్చు కుంటున్నాడు. అవును మరి ఒకటా? రెండా? అయిదు కావాలి. పైగా వీడికి వేరే క్లయింట్ల తొందర లేనట్లు మెలమెల్లగా ఒక్కొక్క బాణమే అనుసంధిస్తున్నాడు. ఛా! నా విషయంలో మాత్రం ఎకాఎకిని అయిదు బాణాలు ఎక్కుపెట్టి హుటాహుటి పుంఖానుపుంఖంగా పడవేస్తే దిక్కుతోచక దిమ్మెత్తి మీ వాకిలి తొక్కాను. మన విషయంలో మాత్రం అందరికి అర్జెంటే! వుత్త పుణ్యానికే వచ్చినట్లు' అని అంటుంటే నీవు సెలయేరులా గలగలా నవ్వుతూ వుంటే నిన్ను అలా సుళ్లు తిప్పి మాయలో పడవేస్తాడు సుమా! ఏమో? ఇంతకూ ఈ కథ ప్రారంభం నించే 'మంగళాదీని, మంగళ మధ్యాని మంగళాంతాని' అని మొదటి మంగళానికి చిహ్నంగా పుచ్చుకున్న ఉపహారనికి గుర్తు అదే నీ చెక్కిళ్ళపై చిగుర్చిన ఆ మోదుగు పువ్వులు తుడ్చుకుని మరీ ప్రారంభించండి చదవటం.

నిన్నటి సంఘటనను చంద్రశేఖర శాస్త్రి మరువలేక పోతున్నాడు. అయాచితంగా తన కంతటి శ్రవణ సుఖాన్ని కలిగించిన వెన్నెల కంఠమాధుర్యం మెలమెల్లగా మనస్సులో ప్రవేశించి ఇప్పుడు తననే ఆక్రమించింది. నిగ్రహానికి మారుపేరుగా నిలిచిన ఈ సాహిత్యవేత్త గాలిసోకిన రీతిగా నిలకడగా ఉండలేకపోతున్నాడు. తాను కాశ్మీరా! అని సంబోధించిన ఆ మాధుర్యమూర్తి ఎవరు? అనే తపనతో దినమంతా గడిపి సాయంకాలం తిరిగి తోటలో ప్రవేశించాడు. అప్పటికే మల్లెపాదుకు నీళ్లు పోసుకుంటున్న వెన్నెల 'కాశ్మీరా!' అనే పిలుపుతో

తిరిగి చూసింది. ఎదుట ఎదిగిన సాలవృక్షంలా వున్న చంద్రశేఖర శాస్త్రిని చూచి ఏమీ తోచక 'మీరెవరు? నా పేరు వెన్నెల. కాశ్మీర ఇక్కడెవ్వరు లేరే' అన్నది.

ఆ మాట విన్న చంద్రశేఖర శాస్త్రి శరీరంలోని ప్రతి అణువు పులకితం కాగా 'వెన్నెల' ఎంత మధురంగా ఉంది ఈ పేరు అని తన రెండు చేతులతో కాదు తన సర్వాంగాలతో ఆమెను అలుముకుని, ఆమెలో లీనం కావాలి అన్నంత భావతీవ్రతను పొందాడు. ఆ వుద్వేగాన్ని నిగ్రహించుకునే వరకు మూర్ఛనికి కనువిప్పు కలిగించేటంత పనైంది. సందడి చేస్తున్న మన్మధ విజృంబణాన్ని ఆగి వెన్నెల ఊరు, వంశం అన్నీ తెలుసుకున్నాడు. ఒక్క లిప్తకాలం నిప్పు తాకిన చేతిని వెనుకకు లాగినట్లు తన మనస్సును ఆమెనుండి వెనుకకు మళ్లించాలనుకున్నాడు. కాని మన్మధుడప్పటికే ఆలీఢపాదుడై సవ్యాపసవ్యాలుగా బాణాలన్నీ వేశాడు.

ఇప్పుడు వెన్నెల తన ఎదుట ఆ మదనుని విజయపతాకం వలె మెరిసిపోతుంది. మరి తనకు మోకరిల్లక తప్పదు. ఇంతవరకు పారే నీటివలె, మధుమాసం వలె, కుసుమ సంవృద్ధివలె, పాలనురుగువలె స్వచ్ఛంగా పసిపిల్లలా వున్న వెన్నెల ఎదలో ఏదో నూతన వికారం, అవ్యక్తాను భూతి ప్రవేశించగా చెంపలు కెంపెక్కుతూ వుంటే వెళ్లిపోతానంటూ లేచింది.

చంద్రశేఖర శాస్త్రి రాగరంజితాలైన ఆ చెంపల కాంతిని భరించలేకపోయాడు. ముద్దుగొన్నాడేమో - భోరుమన్నది వెన్నెల.

ఓదార్చలేదు చంద్రశేఖర శాస్త్రి. శపథం చేయలేదు. కనీసం పెదవి విప్పి మాట్లాడనైన లేదు. చరచరా నడిచి వెళ్లాడు. బొట్టు పెట్టుకుంటూ వుంటే జారిన తిలకాన్ని కడిగినట్లుగా తన ముఖాన్ని కాలువ నీళ్లల్లో కడుక్కొని ఇంటికి వెళ్లే వరకు అక్కడ చంద్రశేఖర శాస్త్రి ఉన్నాడు. ఆనందం, ఉక్రోషం రెండూ జంటగా తనను ఆక్రమిస్తూ వుంటే ఆటలో జారిపడి, మా నాన్నతో చెప్పుతాలే అనే పసితనపు ధీమాతో లోపలికి వెళ్లింది వెన్నెల.

చంద్రశేఖరశాస్త్రి తనను పరిచయం చేసుకుని వెన్నెలను తనకు భార్యగా యివ్వవలసిందని కోరాడు. ఇది విన్న రామయ్య తన చెవులను తానే నమ్మలేదు. ఇంతటి వరుడు తానై వచ్చి అర్థించే బాగ్యానికి తాను తన కూతురు నోచుకున్నారా? ఎగిరి చిందు తొక్కుతూ పదం పాడేంత సంబరం కలిగింది. కానీ ఆ సంతోషం మరుక్షణంలోనే మాయమై ఆ స్థానంలో వివేకం విన్నతనం చోటు చేసుకోగా రామయ్య 'చూడు శేఖరయ్యా! మేము రైతోండ్లము. మీరు బాపనోండ్లు. భోజన బాజినాలల్ల. పొందికలల్ల పోవళ్లల్ల మీకూమాకు పొత్తు ఎట్ల గలుస్తది. అంతెందుకు. ఒక కులం అనుకునే మా వోండ్లల్లనే వడ్లతెగలు, జూడు రెడ్ల శాఖలు జెప్పు' అని కంటి నలుసు బేదాన ఎన్నో పేర్లు. ముల్లే మూట , కట్నం, ఖదరు ఖాందాను ఎన్నో జూస్తరు జోడు గలిసేటందుకు. మరి అసొంటప్పుడు మీకుమాకు పొత్తెట్ల కుదుర్తదయ్యా? నగువాట్ల పరాశ్కమోలె నీవు నా బిడ్డను అడిగితే నా మాణిక్యాన్ని ముక్కూమొకం దెలువని నీ చేతుల పెట్టే ఎంగిలితనం నాకు లేదు. పెండ్లిగాక కానితనం చేసి నా బిడ్డ

నల్గుట్ల నా నెత్తి రుమాలు కింద ఏస్తదన్న భయం నాకు లేదు. ఇంతకు మా ఎన్నలమ్మను ఎప్పుడు జూసినవు? ఏందికత? అని అడ్గి ఎందుకైనా మంచిదని పార్వతమ్మను పిలిచాడు. పార్వతమ్మ వచ్చి విషయం తెలుసుకుని 'సూడు నాయినా? నిన్ను జూస్తె ఆకలి దూప వాసేటట్లుండవు. సదువూ సందె కులం గిలం అన్నీ వుండవి గని యియ్యమైనా కయ్యమైన సరిబరి తూగినపుడే సొగసు గని 'బూరె' అంటె 'అప్పు' మని నీ బింకం జూస్కొని పిల్లనిస్తనంటే 'అంటకు, ముట్టుకు' మనుకుంట నిప్పుతున్కొలె మసలుకుంటున్న మీ అమ్మ ఎన్నలను కోడలిని జేస్కొని కడుపుల పెట్టుకుంటదా? ఉరి వోసుకోదూ? మరి నా బిడ్డ అంత ఎట్టికొచ్చిందా? తూ, సీ, అనంగ మీ కాళ్లమీద పడేసేటందుకు? వద్దు నాయినా! నిండు నూరేళ్లు ఎళ్ళబతుకు. ఇంతకు ఎవరిదన్న కన్నబిడ్డేగద! మరి మీ అమ్మనాయినలను అడ్గినవా? మరి వాళ్లకు మెప్పితమేనా? అన్నది.

'సరే వెళ్లొస్తానంటూ' వెళ్లిపోయాడు కాశ్మీర ప్రణయలంపటుడు.

చంద్రశేఖరున్నంత సేపు మేఘగర్జనం వింటున్న నెమలిలా చలించిపోయింది వెన్నెల. అనుకోకుండా చేతులు చెక్కిళ్లపైకి వెళ్లాయి. వేడిగా వున్న ఆ చెక్కిళ్లపై తనకెంతో పూజ్య భావం కలిగింది. ఛీ! ఎంత మూర్ఖురాలిని. నీళ్లతో కడుక్కొని అవమానించాను. నిజంగా నన్ను చేసుకుంటాడా? ఇది జరిగే పనేనా? నాకెందుకో ఆయన్ను చూడాలనిపిస్తుంది. నా చెంప ముట్టుకున్నాడని నాకెంత కోపం వచ్చింది. ఆఁ! రాదు మరి? పరాయి మగవాడు నన్ను తాకుతాడా? నాకేం తోచక వూరుకున్నాను గాని లేకపోతే ...... లేకపోతే నవ్వుకుంది వెన్నెల. 'ఈశ్వరా ఈయన్నే నాకు భర్తగా అనుగ్రహించు తండ్రీ అని లోలోపల వేయి దేవుళ్లకు మొక్కుకుంది వెన్నెల. బిడ్డలో ఈ మార్పు గ్రహించి పార్వతమ్మ ఆరాట పడసాగింది.

కొడుకు నోట ఈ పెళ్లి విషయం వినడంతోటే ఇంట్లో ఎవరో చచ్చిపోయినట్లు ఏడ్పు ప్రారంభించింది. వెంకటమ్మ ఈ ధర్మశాల తగలడిపోను, ఈ ముదనష్టపు సంపర్కము నా కొంప కూల్చింది. మా పరువూ ప్రతిష్ఠ నిష్ఠ నియమం అంతా ఏ బుగ్గిపాలు? అయ్యయ్యో! సనాతన ఋషి వంశంలో రామ రామ ఏమండి! సంప్రదాయం, అనుష్ఠానం ఏ గంగపాలండి? ఇప్పుడైనా వాణ్ణి మందలించండి. నాయనా! నీ కాళ్లట్టుకుంటానురా. నాకే కట్నాలూ కానుకలూ వద్దురా! మన కులస్థురాలైన పిల్లకు ఏ చచ్చుబ్రాహ్మడి కూతురైనా సరే తాళి కట్టరా! అంటూ కన్నీళ్లు ముక్కునీళ్లు ఏకంగా ప్రవహింప చేసింది.

చివరకు రామనాథ శాస్త్రిగారు 'తులసివనంలో గంజాయి మొక్కలా ఆ పిల్లను తెస్తావట్రా? యికమాకు ఉత్తరగతులేం కాను సంకర సంతానం పిండప్రదానం చేస్తే మా ఆత్మలు ఏం కాన్రా? నీ శాస్త్ర పాండిత్యం ఇందుకా పనికివచ్చింది, అని కన్నీళ్లు పెట్టుకున్నా లాభం లేకపోయింది. విద్యాసంపన్నుడైన చంద్రశేఖరశాస్త్రి తండ్రితో వాదించి నిరుత్తరుణ్ణి చేశాడు.

తాయారమ్మ నాగమణులను పిలిచి సంబంధం కోసం రామయ్యగారింటికి పంపక వెంకటమ్మగారికి తప్పింది కాదు. అది చూసి కొండ దిగివచ్చినట్లుగా తన నోము ఫలించినట్లుగా ఉప్పొంగిపోయింది పార్వతమ్మ. సంబంధం నిశ్చయమైంది. వారి ఆచార ప్రకారం వరపూజ తీసుకుని రామనాథ శాస్త్రిగారింటికి వెళ్లారు. రైతు దంపతులు. పిల్ల గుణం, వారి అణకువ, భయభక్తులు చూసి వెంకటమ్మ ఏదో విధంగా సరిపెట్టుకుంది. వరనిశ్చయం, కన్యానిశ్చయం లక్షణంగా జరిగిన తరువాత చంద్రశేఖర శాస్త్రి

'వెన్నెలా!' అన్నాడు. వెన్నెల నవ్వుతూ అప్పుడు మీరు నన్నెందుకు కాశ్మీర అన్నారు అని అడిగితే! నీ పాట దాడిమ రసం కన్న జుంటితేనెకన్నా తియ్యగా వుంది. కాశ్మీర నాకిష్టమైన తియ్య అరటికి పేరు. ఆనాడు నీవు కాశ్మీర రాగరంజిత వసంత లక్ష్మిలా వున్నావు. అందుకనే నీ పేరు తెలియక కాశ్మీర అన్నాను. అయితే నీవు నిజంగా ఈనాడు నా కంటివెన్నెలవై కూర్చున్నావు అంటూ నాజూకు కళ్లను ముద్దిడుకున్నాడు. గుర్రున చూస్తూ వెన్నెల లోపలికి పరుగెత్తింది.

అక్కా! ఇంకో వారంలో 'ధర్మశాల' పెండ్లి మంటపం కాబోతుంది. గణపతి ఆనందంతో కాదు, విజయగర్వంతో వెలిగిపోతున్నాడు. అక్కా! నిజంగా ఈ పరిణామం మానవ ప్రయత్నమా? లేక దైవసంకల్పమా? ఆలోచించి వ్రాయి.